# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

శనివారం | 25 ఏప్రిల్, 2026 | పేజీలు :08


## ఆర్‌టిసి సమ్మెతో జనజీవనం అస్తవ్యస్తం



వివరాలు మెయిన్‌లో...

## వెంకటాపూర్ గ్రామ అభివృద్ధికి ప్రత్యేక దృష్టితో నిధులు

### మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ప్రజాపక్షం/ఐనవోలు :** వెంకటాపూర్ గ్రామానికి అవసరమైన నిధులు కేటాయించి గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసే బాధ్యత తనదని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. ఐనవోలు మండలం వెంకటాపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆవిష్కరించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి ఐకేపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్బంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మొదటి నుండి వెంకటాపూర్ గ్రామం నాకు అన్ని రకాలుగా అండగా ఉంటుందని తెలిపారు. వెంకటాపూర్ గ్రామ అభివృద్ధి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు వెల్లడించారు. గత 15ఏళ్ళు ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తి ఎం చేశాడో మీ అందరికీ తెలుసని అన్నాడు. తాగుడు, తినుడు, చిల్లర పనులతో నియోజకవర్గానికీ చెడ్డ పేరు తేవడం తప్పు అయన చేసింది ఏమి లేదని విమర్శించారు. ఎవరైనా మీ ఎమ్మెల్యే ఎవరూ అని అడిగితే ఆయన పేరు చెప్పుకోవడానికే సిగ్గు పడాల్సిన పరిస్థితి ఉండేదని అన్నారు. కానీ ఇప్పుడు మీ ఎమ్మెల్యే ఎవరు అంటే కడియం శ్రీహరి అని గర్వంగా చెప్పుకునే విధంగానే నా పని తీరు, ప్రవర్తన ఉంటుందని స్పష్టం చేశారు. 20ఏళ్ళు వాళ్ళు చేయని పనులన్నీ నా మీద పడుతున్నాయని, ఒక్కొక్కటిగా చేసుకుంటూ ముందుకు వెళ్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు నమ్మి ఓటు వేసి గెలిపించినందుకు వారి సమస్యలను పరిష్కరిస్తూ, గ్రామాలను అభివృద్ధి చేస్తూ వారి నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకే అహర్నిశలు కృషి చేస్తానని వెల్లడించారు. తన ధ్యాస, ఆలోచన అంతా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడం, ప్రతీ ఎకరానికి సాగు నీరు అందించడం మాత్రమే అని తెలిపారు. తన 30ఏళ్ల రాజకీయ జీవితంలో ఏనాడూ తప్పు చేయలేదని అన్నారు. నిజాయితీగా, నిక్కర్సుగా ఉంటానని అందుకే నా మీద ఆరోపణలు చేయడానికి కూడా భయపడుతారని తెలిపారు. ఒక సాధారణ పేద కుటుంబం నుండి వచ్చి ఇన్నేళ్లుగా రాజకీయాలలో కొనసాగుతున్నాను అంటే ఆ నిజాయితీనే కారణమని వెల్లడించారు. వెంకటాపూర్ గ్రామంలో మొదటి విడతలో 33ఇందిరమ్మ ఇండ్లు మంజూరు ఇచ్చానని, రెండో విడతలో మరో 40ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తానని తెలిపారు. ఎస్సి కాలనీ నుండి స్మశాన వాటిక రోడ్డును త్వరలోనే మంజూరు చేస్తానని ఉన్నత పాఠశాలలో నీరు నిల్వ ఉండకుండా లేవలింగ్ చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఆర్ డీఏ పీడీ శ్రీనివాస్, హౌసింగ్ పీడీ,స్థానిక సర్పంచ్, ఇతర అధికారులు, మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నైపుణ్యాభివృద్ధితోనే ఉజ్వల భవిష్యత్తు

### నిరంతర సాధనతోనే విజయం సాధ్యం
### సంకుచిత భావనలు విడిచి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి
### జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ప్రజాపక్షం/ములుగు:** యువత నైపుణ్యంలో అభివృద్ధి సాధిస్తేనే ఉజ్వల భవిష్యత్తు నిర్మించుకోగలరని, నిరంతర సాధనతోనే విజయం సిద్ధిస్తుందని, సంకుచిత భావనలను విస్మరించి వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటు జీవితంలో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ యువతకు దిశానిర్దేశం చేశారు. శుక్రవారం 99 రోజుల ప్రజాపాలన....ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవంలో జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణపై అవగాహన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ నిర్వహించారు. టాస్క్ సెంటర్, ఐటిడిఏ, డిఆర్‌డిఏ, ఎస్‌సి కార్పొరేషన్, ఉద్యానవనశాఖల ద్వారా యువతకు అందుబాటులో ఉన్న శిక్షణ తరగతులు, ఉపాధి అవకాశాలపై సంబంధిత అధికారులు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యువత నైపుణ్యాభివృద్ధితో ఉజ్వలమైన భవిష్యత్తుకు పునాదులు వేసుకోవచ్చని, సంకల్పంతో నిరంతరం సాధన చేస్తే విజయం తప్పనిసరిగా వరిస్తుందని, వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటు జీవితంలో ముందుకు సాగాలని సూచించారు. ప్రత్యేకంగా ములుగు జిల్లాలోని యువతకు వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ అందించేందుకు టాస్క్ సెంటర్‌ను ప్రారంభిచామని, దీని ద్వారా యువత ఎంచుకున్న రంగాల్లో నైపుణ్యం సాధించేలా ఉచిత శిక్షణ అందించి ఉపాధి కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. టాస్క్ సెంటర్ ఏర్పాటు చేసినప్పటి నుండి 10 బ్యాచ్‌లకు శిక్షణ పూర్తి చేశామని, ఇందులో 250 మందికి పైగా యువతకు ఉద్యోగ అవకాశాలు లభించాయని పేర్కొన్నారు. యువత సమయాన్ని వృథా చేయకుండా ఏదైనా రంగంలో పనిచేయాలనే ఆసక్తి కలిగి ఉండాలని, ప్రభుత్వం అందించే ఉచిత శిక్షణ, ఉపాధి కల్పన పథకాలను సద్వినియోగం చేసుకొని జీవితంలో స్థిరపడాలని తెలిపారు. ప్రతిభకు కష్టాలు, పేదరికం అవరోధం కాదని, ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని, కష్టాలను బాధలను అధిగమిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని యువతకు సూచించారు. అనంతరం ఐటిడిఏ ఆధ్వర్యంలో జ్యూట్ బ్యాగుల తయారీ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సర్టిఫికేట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్‌రావు, ఐటిడిఏ ఏపిఓ కె నాగోరావు, డిఆర్‌డిఓ చంద్రశేఖర్, ట్రైబల్ వెల్ఫేర్ డిడి జనార్ధన్, ఉద్యానవన శాఖ అధికారి సంజీవరావు, ఎస్‌సి డెవలప్‌మెంట్ ఈడి ధర్మనాయక్, డిఈఓ సిద్ధార్థ రెడ్డి, అడిషనల్ పిడి శ్రీనివాసరావు, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి సేవలు.. వెలకట్టలేనివి



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** గ్రామాల్లో అంగన్వాడి టీచర్లు గర్భిణీలకు, చిన్నపిల్లలకు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని, వారి సేవలు మరువ లేనివని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కొనియాడారు. శుక్రవారం భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని పుష్ప గ్రాండ్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పోషణ పక్వాడ కార్యక్రమం ప్రారంభోత్సవం, అంగనవాడి టీచర్లకు స్మార్ట్‌ఫోన్‌ల పంపిణీ కార్యక్రమలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేశారు. ముందుగా కార్యక్రమంలో ఎమ్మెల్యే, కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించినారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఐసిడిఎస్ సిడిపిఓ ఇంచార్జీ జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి మల్లీశ్వరి అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్తన్న మాట్లాడుతూ, రాష్ట్రంలోని అన్ని అంగన్వాడి కేంద్రాలను అభివృద్ధి చేయడంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రతి గ్రామంలో అంగన్వాడి కేంద్రాలకు పక్క భవనాలు నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యం అన్నారు. అంగన్వాడి పక్క భవనాల కోసం వివరాలు అందించాలని వెంటనే పక్క భవనాల నిర్మాణాలు చేపడతామని చెప్పారు. అంగన్వాడి టీచర్లకు స్మార్ట్‌ఫోన్ల పంపిణీ ద్వారా సేవల నాణ్యత మరింత మెరుగవుతుందని చెప్పారు. అంగన్వాడి టీచర్లు గర్భిణీ స్త్రీలకు పౌష్టిక ఆహారం అందజేయాలని, తల్లిపాలే బిడ్డకు శ్రేష్టమైనదని, తల్లిపాలతో పిల్లలకు వచ్చే వ్యాధి నెలలు నివారించవచ్చని తెలిపారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య వివరాలను డిజిటల్ విధానంలో నమోదు చేయడం సులభతరం అవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, అంగన్వాడీ టీచర్లు ఈ స్మార్ట్ ఫోన్లతో పోషణ పక్వాడ కార్యక్రమం ద్వారా 15 రోజుల పాటు పౌష్టికా హారంపైఅవగాహన కల్పించడంతో పాటు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య స్థితిగతులను పర్యవేక్షించనున్నట్లు చెప్పారు. ప్రతి నెల మొదటి వారంలో పిల్లల ఎత్తు, బరువులను కొలిచి డిజిటల్ యాప్స్‌లో నమోదు చేస్తే పోషణ లోపాలను త్వరగా గుర్తించి తగిన చర్యలు తీసుకోవచ్చన్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని ఏడు మండలాల పరిధిలో 414 స్మార్ట్ ఫోన్లను అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, ఆర్.టి.ఏ సభ్యులు సుంకరి రామచంద్రయ్య, స్థానిక కౌన్సిలర్లు పుల్లూరి మంజుల మాధవరావు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, అంగన్వాడి టీచర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలి..

**ప్రజాపక్షం /నడికూడ :** నడికూడ మండల పరిధిలోని కంఠాత్మకూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల పేరెంట్స్ మీటింగ్ జరగగా గ్రామ కార్యదర్శి లావణ్య పాల్గొని మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా చెరువులు,బావులు,వాగుల వద్దకు ఈతకు వెళ్లే పిల్లల పట్ల పేరెంట్స్ జాగ్రత్తగా ఉండాలని ఎండ ప్రభావం ఉంది కావున పిల్లలను బయటికి పంపకుండా చూసుకోవాలని రోజు చాలా సార్లు నీరు త్రాగాలని పానీయాలు తగ్గించుకోవాలని పోషకాహారం,పండ్లు,పాలు,కూరగాయలు ఎక్కువ తీసుకోవడం మంచిదని తెలియని వారితో మాట్లాడవద్దని పిల్లలకు చెప్పాలని బయటికి ఒంటరిగా పిల్లలను వెళ్లకుండా చూసుకోవాలని పిల్లలకు మొబైల్ ను ఇవ్వకూడదని ప్రతిరోజు వ్యాయామం చేయడం మంచిదని ఇంటి వద్దనే పిల్లలను ఉండేలా చూసుకోవాలని కోరుతున్నానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,పేరెంట్స్, తదితరులు పాల్గొన్నారు.

# 30న పిహెచ్ డి ప్రవేశాలకు మౌఖిక పరీక్షలు

**ప్రజాపక్షం/ వరంగల్ టౌన్ :** సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో పిహెచ్ డి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 30న మౌఖిక పరీక్షలు నిర్వహించనున్నట్లు పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 202526 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశ ప్రకటనలో భాగంగా ఈ మౌఖిక పరీక్షలు హైదరాబాద్ బాచుపల్లి లోని తెలుగు విశ్వవిద్యాలయం కేంద్ర కార్యాలయంలో ఏప్రిల్ 30 న మధ్యాహ్నం 12 గంటల నుండి నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. జానపద గిరిజన విజ్ఞానంపై జరిగే ఈ మౌఖిక పరీక్ష ద్వారా అభ్యర్థుల పరిశోధన సామర్థ్యం, సంబంధిత పరిశోధన అంశంపై అవగాహన, అకాడమిక్ ప్రతిభను సమగ్రంగా అంచనా వేస్తామని అన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ వెంట ఒరిజినల్ సర్టిఫికెట్స్, గుర్తింపు పత్రాలు వెంట తీసుకురావాలని వెంకన్న సూచించారు.

# నూతన కరెంట్ పోల్స్, వైర్ల ప్రారంభం



**ప్రజాపక్షం/నెక్కొండ:**వరంగల్ జిల్లా నెక్కొండ మండలం చెరువు ముందరి తండా గ్రామ పంచాయతీ పరిధిలోని కునుసోత్ తండాలో నూతనంగా ఏర్పాటుచేసిన కరెంట్ పోల్స్, వైర్ల పనులను గ్రామ సర్పంచ్ కునుసోతు మంగమ్మ, శ్రీను నాయక్ ప్రారంభించారు. తండా ప్రజలకు మెరుగైన విద్యుత్ సదుపాయం అందించేందుకు ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మూడు మంగమ్మ, రాజేందర్, వార్డు సభ్యులు పాలిత్య శంకర్ నాయక్, తండావాసులు హరిలాల్ నాయక్, జాన్య, రాంబాబు, వీరన్న, బొడ బికు, తిరుమల్, నరేష్, రంగమ్మ, ఈరమ్మ, లక్ష్మి, హాంజరి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌టిసి డ్రైవర్ మృతి పట్ల వరంగల్ ఎంపి కావ్య దిగ్భ్రాంతి

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ఆర్‌టిసి డ్రైవర్ శంకర్ గౌడ్ బలవన్మరణం పట్ల వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన బాధాకరమని పేర్కొంటూ, మృతుడి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని సీఎం రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారని తెలిపారు.ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కాదని, ప్రభుత్వం చర్చల ద్వారా కార్మికుల డిమాండ్ లను పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తున్న క్రమంలో కార్మికులు ఆందోళన చెందడం విచారకరం అన్నారు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాలు కుటుంబ భవిష్యత్తులో దెబ్బతీస్తాయి కాబట్టి ఇలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య సూచించారు. సమస్యలు వచ్చినప్పుడు సహనం పాటిస్తూ, చర్చల ద్వారా పరిష్కారం సాధించుకోవాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు.శంకర్ గౌడ్ మృతి మృతి పట్ల వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య సంతాపం వ్యక్తం చేశారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు. కుటుంబ సభ్యులు ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని, వారికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యత



**ప్రజాపక్షం /ఎల్కతుర్తి :** ఎల్కతుర్తి మండలంలోని ఇంద్రనగర్ గ్రామంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్వచ్ఛతపై ప్రత్యేక చైతన్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అంబాల రాజు మాట్లాడుతూ మహాత్మా గాంధీ కలలుగన్న భారతదేశం కేవలం స్వాతంత్ర్యంతోనే కాదు, పరిశుభ్రతతో కూడిన సమాజంతోనే సార్థకమవుతుందని ఆయన పేర్కొన్నారు. స్వాతంత్ర్యం కంటే పారిశుధ్యమే ముఖ్యం అనే గాంధీజీ ఆలోచనలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు.గ్రామ ప్రజలందరూ తమ ఇళ్లను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రతి కుటుంబం తప్పనిసరిగా మరుగుదొడ్లు నిర్మించుకోవడంతో పాటు వాటిని వినియోగించుకోవాలని సూచించారు. బహిరంగ మలవిసర్జన వల్ల వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని, దాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు గ్రామస్థులు సహకరించాలని కోరారు.చెత్త చెదారాన్ని ఎక్కడ పడితే అక్కడ వేయకుండా క్రమ పద్ధతిలో నిర్వహించుకోవాలని, గ్రామంలో శుభ్రతను కాపాడేందుకు అందరూ ముందుకు రావాలని ఆయన అన్నారు. నీటి సంరక్షణపై కూడా దృష్టి సారిస్తూ వర్షపు నీటిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా భూగర్భ జలాలను పెంచుకోవచ్చని వివరించారు.స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్యాలను సాధించడంలో గ్రామ ప్రజల పాత్ర కీలకమని, ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా ఒక అడుగు స్వచ్ఛత వైపు వేస్తే దేశం పూర్తిగా పరిశుభ్రంగా మారుతుందని అంబాల రాజు కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి, వార్డు సభ్యులు, ఏఎన్ఎం ఆశ వర్కర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌టిసి కార్మికుల డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలి

### సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాగుల రమేష్



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఆర్‌టిసి కార్మిక సంఘాల జెఎసిఆధ్వర్యంలో గత మూడు రోజుల నుండి రాష్ట్ర వ్యాప్తంగా సాగుతున్న సమ్మె సందర్భంగా హనుమకొండ డిపో ముందు ఆర్‌టిసికార్మికులు చేస్తున్న ధర్నాలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాగుల రమేష్ పాల్గొని మద్దతు తెలుపుతూ మాట్లాడారు. ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం, ఉద్యోగాల భర్తీ, కార్మికుల బకాయిల చెల్లింపు, కార్మిక సంఘం ఎన్నికలు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల రెగ్యులరైజ్ తదితర 32 డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వం వేసిన ఐఏఎస్ అధికారుల కమిటీ 4 వారాల గడువు కోరడం సమ్మెను నీరుగార్చడమేనని, ప్రభుత్వం తక్షణమే జెఎసి నాయకులతో చర్చలు జరిపి, ఆర్‌టిసికార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పరిష్కరించాలని రమేష్ డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా రావలసిన సుమారు రు. 400 కోట్లతో పాటు, ఇతర బకాయిలను వెంటనే చెల్లించి, సంస్థను ఆర్థిక సంక్షోభం నుండి గట్టెక్కించాలన్నారు. అద్దె బస్సుల ముసుగులో సంస్థను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు ఎలక్ట్రిసిటీ బస్సులు ప్రైవేటు వ్యక్తుల ద్వారా కొనుగోలు చేసి నడుపుతున్నదనీ, ప్రభుత్వమే నేరుగా ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేసి, వాటిని సంపూర్ణంగాఆర్‌టిసి సంస్థకే అప్పగించాలనీ, ఏళ్ల తరబడి కనీస వేతనాలు, సౌకర్యాలు లేకుండా శ్రమ దోపిడీకి గురవుతున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలన్నారు. గుర్తింపు సంఘం ఎన్నికలను జరపకపోవడం అంటే వారి హక్కులను కాలరాస్తూ, కార్మికుల గొంతు నొక్కడమేనని, తక్షణమే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ఎస్ డబ్ల్యూ ఎఫ్ రీజియన్ అధ్యక్షులు టి ఎల్లయ్య, డిపో సెక్రటరీ పి.మహేందర్,కేసరి, కే రతన్, టి శ్రీనివాస్, వైవీ లక్ష్మి , పి పుష్ప, మోహన్, ఆర్ శ్రీధర్, యం చారి, శ్రీనివాస్, ఆర్‌టిసి కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మాజీ మంత్రి, మాజీ ఎంపిలను అడ్డుకున్న పోలీసులు



**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** నర్సంపేటలో గురువారం ఆత్మహత్య చేసుకుని మృతిచెందిన ఆర్టీసి బస్ డ్రైవర్ శంకర్ గౌడ్ శుక్రవారం అంత్యక్రియలు జరుగనున్న నేపథ్యంలో నర్సంపేటకు వెళ్తున్న మాజీ హోం మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎంపీలు బోయిన్‌పల్లి వినోద్‌కుమార్, మాలోతు కవితలను శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పై అధికారుల ఆదేశాల మేరకు కోమల టోల్ ప్లాజా వద్ద వారిని రఘునాథపల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని సీఐ కార్యాలయానికి తరలించారు. విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి వెంటనే పార్టీ శ్రేణులతో పాటు మండల నాయకులతో కలిసి పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని పోలీస్ స్టేషన్ ఎదుట అరెస్ట్ చేసిన మాజీ మంత్రి, మాజీ ఎంపీలను వెంటనే విడుదల చేయాలంటూ ధర్నా నిర్వహించారు. తరువాత పోలీసులు కలుగజేసుకుని పై అధికారులతో మాట్లాడి అరెస్టు చేసిన వారిని విడుదల చేస్తామని చెప్పడంతో వారు శాంతించారు. పై అధికారుల ఆదేశాల మేరకు మాజీ హోం మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎంపీలు బోయిన్‌పల్లి వినోద్‌కుమార్, మాలోతు కవి తలను విడుదల చేశారు. ఆర్టీసి డ్రైవర్ శంకర్ గౌడ్‌ది ఆత్మహత్య కాదని ఇది ముమ్మాటికి ప్రభుత్వ హత్యేనన్నారు. ఆ యన కుటుంబానికి రూ.10లక్షలు కాదు రూ.1కోటి పరిహారం ప్రభుత్వం ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. అతని కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. పోలీసులు వారిని నర్సంపేటకు వెళ్లడానికి అనుమతి నిరాకరించడంతో చివరకు వారంతా వెనుతిరిగి జనగామ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లి అక్కడి నుండి హైధరాబాద్‌కు వెళ్తున్నట్లు చెప్పడంతో వేడెక్కిన సీఐ కార్యాలయ వాతావరణం ఒక్కసారిగా చల్లబడి అటు పోలీసులు, ఇటు నాయకులు, కార్యకర్తలు అంతా ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. ఇందులో జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ దూదిమెట్ల నరేష్ యాదవ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



**ప్రజాపక్షం / వేలేరు :** వేలేరు మండలంలోని మల్లికుదుర్ల,గుండ్ల సాగర్,సోడషపల్లి,శాలపల్లి,పీచర గ్రామాలలోని సర్పంచ్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం ఐకెపి ఎపిఎం అనిత,ఎఒ కవిత దాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంబించారు.ఈసంధర్భంగా వారు మాట్లాడుతూ దళారును ఆశ్రయించి మోసపోకూడదనే సదుద్దేశంతోనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమే దాన్యం కొనుగోలు చేస్తోందని అన్నారు.రైతులు ఐకెపి కేంద్రాలలోనే దాన్యం అమ్మకాలు చేయాలని రోడ్లమీద దాన్యం ఆరబోయడం వలన ప్రయాణీకులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున దాన్యరాశులను రోడ్ల మీద ఆరబోయకూడదని అన్నారు.కార్యక్రమంలో సర్పంచ్‌లు జక్కుల మౌనిక సంపత్ యాదవ్, మానస శివ,వెన్నం రమాదేవి సంపత్‌రెడ్డి,కూరపాటి అశోక్,మరిజె అనిత నర్సింగారావు,ఎఇఒలు శిల్ప,విజయ్,సిసిలు సతీష్,రమాదేవి,నాగమణి,మండలసమాఖ్యఅధ్యక్షురాలు ఆల్ల రేణుక,వివిధ గ్రామాల ఉపసర్పంచ్‌లు,వార్డు సభ్యులు,విఒఎలు,మహిళలు,రైతులు,హమాలీలు వివిద గ్రామాల రాజకీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



**ప్రజాపక్షం/భీమదేవరపల్లి :** రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తేనే మద్దతు ధర లభిస్తుందని మార్కెట్ చైర్మన్ సంతాజీ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఐకేపీ–ఎస్ఈఆర్‌పి ఆధ్వర్యంలో కొత్తకొండ, భీమదేవరపల్లి,వంగర, మాణిక్యపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా సంతాజీ మాట్లాడుతూ, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కేంద్రాల ఇన్‌చార్జ్‌లు సమర్థంగా పని చేయాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరతో పాటు అదనపు బోనస్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో ఏపీఎం వేణు,మార్కెట్ వైస్ చైర్మన్ స్రవంతి,స్థానిక సర్పంచ్‌లు,పి. సదానందం,కర్ణాకర్, అశోక్,టీ.పద్మ తదితరులు పాల్గొన్నా రు.

# గిగ్ వర్కర్ల గుర్తింపు చరిత్రాత్మక నిర్ణయం

**ప్రజాపక్షం/జనగామ :**గిగ్ వర్కర్ల గుర్తింపు చారిత్రాత్మక నిర్ణయమని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి అన్నారు. శుక్రవారం జిల్లా పోలిటికల్ అడ్వజరి కమిటి సమావేశం డిసిసి కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు ధన్వంతి మాట్లాడుతూ స్విగ్గి, జుమోటో వంటి సంస్థల్లో పనిచేసే డెలివరీ బాయ్స్, ప్లాట్‌ఫాంలలో పనిచేసే డ్రైవర్లును ప్రత్యేక కార్మికులుగా గుర్తించడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. ఈ నిర్ణయం ద్వారా వారికి సామాజిక భద్రత కల్పించే దిశగా ప్రభుత్వం ముందడుగు వేస్తుందన్రాను. పార్టీ బలోపేత, జిల్లా మండలాల్లో, గ్రామ స్థాయిలో కమిటిల ఏర్పాటుపై చర్చించారు. ప్రజల సమస్యల్ని గుర్తించి వాటి పరిష్కారం కోసం కాంగ్రెస్ కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ కడకంచి బాలమణి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బడికె ఇందిర, ఓబిసి సెల్ జిల్లా అధ్యక్షులు లొక్కుంట్ల ప్రవీణ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బోనాసి క్రాంతి, సేవాదళ్ అధ్యక్షుడు పారుపల్లి ప్రభాకర్, మైనార్టీ సెల్ అద్యక్షులు మహమ్మద్ జాఫర్ షరీఫ్, ఆర్జీపిటిఎస్ జిల్లా అధ్యక్షులు సాధం మనోహర్, ఆదివాసి సెల్ అధ్యక్షుడు నునావత్ సుమన్ నాయక్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చెంచారపు బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.




## గిరిజన కాలనీలో అంగన్వాడీ విద్యోత్సవం

ప్రజాపక్షం/గోవిందరావుపేట:ములుగు జిల్లా తాడ్వాయి ప్రాజెక్ట్ పరిధిలోని పసర సెక్టర్ జీపీ స్థాయి అంగన్వాడీ కేంద్రాలను సమన్వయం చేస్తూ గిరిజన కాలనీ అంగన్వాడీ సెంటర్‌లో ప్రథమ్ ఆధ్వర్యంలో పాఠశాల సంసిద్ధత మేళా గ్రాడ్యుయేషన్ డే ఇసిసిఈడే కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ములుగు జిల్లా మహిళా అభివృద్ధి అధికారి డిడబ్ల్యు ప్రేమలత హాజరు కాగా పసర సర్పంచ్ భూక్య సుమలత అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా డిడబ్ల్యు ప్రేమలత మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అంగన్వాడీ కేంద్రాలు కూడా నాణ్యమైన విద్యను అందిస్తున్నాయని చిన్నారులకు ఆటలు పాటలు ద్వారాబోధన అందిస్తున్నామని తెలిపారు అలాగే గర్భిణీలు బాలింతలు అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని తీసుకోవాలనిసూచించారు ప్రథమ్ మాస్టర్ ట్రైనర్ అనిల్ పిల్లల ఐదు అభివృద్ధి అంశాల పై వివిధ ఆటలను నిర్వహించారు సూమారు 35 మంది పిల్లలు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు ఇంచార్జ్ సిడిపిఒవిజయ మాట్లాడుతూ పిల్లలు ఆటలు పాటలు కథలు సంభాషణలు పూర్వ గణిత భావనలు ప్రదర్శించి తల్లి దండ్రులు ఆకట్టుకున్నారని తెలిపారు భాషా మేధస్సు సామాజిక సృజనాత్మక అభివృద్ధిపై వివరణ ఇచ్చి పిల్లలకు రిపోర్ట్ కార్డులను డిడబ్ల్యుఓ ప్రేమలత సర్పంచ్ భూక్య సుమలత ఇంచార్జ్ సిపిడిఓ విజయ సూపర్వైజర్ శారదా పంచాయతీ కార్యదర్శి సతీష్ చేతుల మీదుగా అందజేశారు ప్రీ స్కూల్ సామగ్రి ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది ఈ కార్యక్రమంలో డిడబ్ల్యుఓ ప్రేమలత సర్పంచ్ భూక్య సుమలత ఇంచార్జి సిడిపిఓ విజయ సూపర్వైజర్ శారదా పంచాయతీ కార్యదర్శి సతీష్ హరి టీచర్లే పద్మరాణని భాగ్య కొమురమ్మ తో పాటు పిల్లల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నష్టపరిహారం చెల్లించకపోతే ప్రభుత్వ పతనం తప్పదు

### సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండి దావూద్ ప్రభుత్వానికి హెచ్చరిక



ప్రజాపక్షం/ఏటూరునాగారం:మండల కేంద్రం లోని గత రెండు రోజులుగా కురుస్తున్నా అకాల వర్షానికి నష్టపోయిన పంట పొలాలను సిపిఎం మండల బృందం ఈరోజు శివపురం, గోగుపల్లి ,చిన్న బోయినపల్లి గ్రామాల్లో పంట పొలాలను సందర్శించారు. అనంతరం ప్రభుత్వాన్ని ఉద్దేశించి దావూద్ మాట్లాడుతూ, నిన్న మొన్న అధిక గాలులతో కూడిన వర్షంతో రైతుల వరి పొలాల్లో ధాన్యం రాలి పోయి మొత్తం పడిపోయాయని కోసిన రైతుల పరిస్థితి చూస్తే బరకాలు గాలులకు లేచిపోయి వాళ్ళ పరిస్థితి వర్ణాతీతం అన్నారు. అదే విధంగా సంవత్సరం మే 14 .2025 న గోగుపల్లి అనే గ్రామంలో పక్కనే ఉన్న వాగులో ధాన్యం ఎండబెట్టుకుంటే అనుకోకుండా హఠాత్తుగా వర్షం పడడంతో49 మంది రైతుల ధాన్యం వాగులో కొట్టుకుపోయాయని ఇదే టైంలో రాష్ట్రవ్యాప్తంగా కూడా నష్టం జరిగితే ప్రభుత్వం రాష్ట్ర మంత్రివర్గం 2025 మే 28న సమావేశమయ్యి నష్టాన్ని అంచనా వేసి రాష్ట్రవ్యాప్తంగా 51 కోట్ల 50 లక్షలు, ములుగు జిల్లాలో ఐదు కోట్ల 73 లక్షలు వెంటనే మంజూరు చేసి సంవత్సరం గడిచిన రైతుల ఖాతాల్లో ఒక చిల్లిగవ్వ పడలేదంటే దీన్ని ఏమంటారు అని దావూద్ ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు. నష్టపరిహారం చెల్లించాలని ఎన్ని పోరాటాలు చేసిన రైతుల ఖాతాల్లో డబ్బులు పడకపోవడంతో రైతులు ప్రభుత్వంపై నిరసన జ్వాలలు వెళ్లబుచ్చుతున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం నిన్న, మొన్న కురిసిన వర్షాలకు నష్టాన్ని అంచనా వేసి గత సంవత్సరం డబ్బుల్ని ఈ సంవత్సరం నష్టాన్ని రైతులకు చెల్లించి పరువు కాపాడుకోవాలని లేని పక్షంలో రైతుల్ని సమీకరించి పోరాటాలు తీవ్రతరం చేస్తామని దావూద్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిఎల్ రవి, తోలెం కృష్ణయ్య, ఎండి యాకూబ్ రెడ్డి, వెంకటరెడ్డి, యానాల నర్సిరెడ్డి, ఈసం నారాయణ, పెంచికల లక్ష్మీనారాయణ, ఈసం రమేష్, బత్తుల యాదగిరి లు పాల్గొన్నారు.

## ఆర్‌టిసి కార్మికుడు శంకర్ గౌడ్ మృతి తీరని లోటు



ప్రజాపక్షం/తొర్రూరు : ఆర్‌టిసి కార్మికుడు శంకర్‌గౌడ్ మృతి కార్మిక ఉద్యమానికి తీరని లోటు అని తొర్రూరు ఆర్‌టిసిజెఎసి ఛైర్మన్ జిలుకర యాదగిరి అన్నారు. ఆర్టీసీ జెఎసి ఆధ్వర్యంలో మూడవ రోజు సమ్మెలో భాగంగా శుక్రవారం ఆర్‌టిసికార్మికుడు శంకర్‌గౌడ్ మృతికి సంతాపంగా ఆర్‌టిసిడిపో నుంచి గాంధీ సెంటర్ వరకు కార్మికులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ శంకర్‌గౌడ్ ఆత్మ బలిదానం కార్మిక లోకాన్ని తీవ్రంగా కలిచి వేసిందన్నారు. శంకర్ గౌడ్ సంస్థను కాపాడేందుకు కార్మికుల హక్కుల కోసం ప్రాణత్యాగం చేశాడని కొనియాడారు. హక్కుల సాధన కోసం సంఘటితంగా పోరాడాలి తప్ప ఇలాంటి ఆత్మ బలిదానాలకు ఎవరూ ఒడిగట్టవద్దని కోరారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని కోరారు. ఆర్‌టిసి కార్మికుల న్యాయమైన ఆవేదనను పరిగణలోకి తీసుకొని ప్రభుత్వం తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలోజెఎసి వైస్ ఛైర్మన్ జి.రమేష్, కోశాధికారి రవీందర్, సలహాదారులు మల్లికార్జున్, ఆర్.ఎస్.కుమార్, జి.యాకయ్య, బికె స్వామి, జి.వెంకన్న, ఎంకె రావు, ఏవీఎం చారి, ఎండి.షాబుద్దీన్, ఎఎస్ బాబు, ఆర్‌టిసికార్మికులు పాల్గొన్నారు.

## మిల్లర్ల దగా.. రైతుల గోస

ప్రజాపక్షం/గోవిందరావుపేట:రబీ సీజన్‌లో సుమారు 5000 ఎకరాల ఆయకట్ట కింద సాగు చేసిన రైతులు ప్రస్తుతం మిల్లర్ల దందాతో తీవ్రంగా నష్టపోతున్నారని ఏనుగు రవీందర్ రెడ్డి ఆవేదనవ్యక్తం చేశారు జిల్లాలోని మిల్లర్లు అసోసియేషన్ గా ఏర్పడి రైతులను వ్యవస్థ పూర్వకంగా మోసం చేస్తున్నారని ఆయన ఆరోపించారు దిగుబడి వచ్చిన సమయంలో కింటాకు ఐదు నుంచి పది కిలోల వరకు అక్రమంగా కట్ చేస్తున్నారని కొందరు మిల్లర్లు పచ్చి ఒడ్లు కొనుగోలు పేరుతో కనీస మద్దతు ధర ఎమ్ఎస్‌పి కంటే తక్కువ రేట్లు నిర్ణయించి రైతులను దోచుకుంటున్నారని తెలిపారు రైతులు ఎండాకాలంలో చెమటోడ్చి పండించిన పంటలకు సరైన ధర దక్కకపోవడం దురదృష్టకరమన్నారు జిల్లా కలెక్టర్ వ్యవసాయ శాఖ అధికారులు ప్రజా ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తున్న మంత్రి సీతక్క రైతుల సమస్యల పై స్పందించకుండా మౌనం వహించడం బాధాకరమని రవీందర్‌రెడ్డి విమర్శించారు మిల్లర్ల దోపిడీ పై చర్యలు తీసుకోవాల్సిన అధికార యంత్రాంగం చూసి చూడనట్లు వ్యవహరించడం సిగ్గుచేటని అన్నారు మండలంలోని ఐకెపి టీసీఎస్ కొనుగోలు కేంద్రాల్లో కూడా పరిస్థితి మారలేదని కాంటా పెట్టే ముందు రైతులు మిల్లర్ల తో ఒప్పందం చేసుకోవాలని ఒత్తిడి తీసుకురావడం దుర్వినియోగానికి నిదర్శనమని పేర్కొన్నారు కొన్ని కేంద్రాల్లో రూ30 కమిషన్ పేరుతో రైతులపై అదనపు భారం మోపుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం స్పందించి కొనుగోలు కేంద్రాలపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కటింగ్ పేరుతో జరుగుతున్న మోసాన్ని అరికట్టాలని 1156 రకం ధాన్యాన్ని సరైన ధరకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు అలాగే ప్రతిపక్ష పార్టీలైన టీఆర్ఎస్ కమ్యూనిస్టు పార్టీలు కూడా రైతుల సమస్యలపై మౌనం వహించడం ఆశ్చర్యకరమని రైతుల పక్షాన నిలబడి పోరాటం చేయాల్సిన అవసరం ఉందని ఏనుగు రవీందర్ రెడ్డి పేర్కొన్నారు.

## కార్మిక హక్కుల పోరాట యోధుడు సంజయ్ సింగ్వి

ప్రజాపక్షం/తొర్రూరు : కార్మిక హక్కుల పోరాట యోధుడు ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా టీయూసీఐ అఖిల భారత కార్యదర్శి సంజయ్ సింగ్వి అని మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి రవి అన్నారు. సంజయ్ సింగ్ ప్రథమ వర్ధంతి సందర్భంగా తొర్రూరు ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా సింగ్వి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం రవి మాట్లాడుతూ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన సంజయ్ సింగ్వి ఉన్నత చదువులు చదివి సుప్రీం కోర్టు లాయర్‌గా ఎదిగారని అన్నారు. కార్మికులకు కనీస వేతనాలు, పని గంటల అమలు, యూనియన్ ఏర్పాటు వంటి అనేక కేసులు సుప్రీంకోర్టులో వాదించి కార్మిక వర్గానికి అనుకూల తీర్పులు రావడంలో కీలకపాత్ర పోషించారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా నాయకులు అర్వపల్లి వెంకన్న, బైరి శ్రీనివాస్, మాచర్ల మురళి, వెంకన్న, జగన్, యాకయ్య, లక్ష్మి , యాకమ్మ, మల్లమ్మ, యాకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలు

ప్రజాపక్షం/తొర్రూరు : డివిజన్ కేంద్రంలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ హాల్‌లో డాక్టర్ కూరపాటి రమేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా ఆరోగ్యం, పరిరక్షణలో ప్రజా ప్రతినిధుల పాత్రపై అవగాహన సదస్సు, ప్రజాప్రతినిధులకు సన్మాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ హనుమాండ్ల ఝాన్సీరాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా ఆరోగ్య పరిరక్షణలో ప్రజాప్రతినిధులు కీలకపాత్ర పోషించాలన్నారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్య సదుపాయాలు అందించేందుకు ప్రభుత్వంతో పాటు స్థానిక నాయకులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం డాక్టర్ కూరపాటి రమేష్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు గ్రామాలను పరిశుభ్రంగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకునేలా ప్రజలకు సూచనలు ఇవ్వాలన్నారు. డాక్టర్ కూరపాటి రాధిక మాట్లాడుతూ ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తూ ఇంటిని శుభ్రంగా ఉంచుకుంటే ఎలాంటి వ్యాధులు దరి చేరవన్నారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, సేవా కార్యక్రమాల్లో విశేషంగా కృషి చేసిన వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ, పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాఫెడ్, బాలవికాస సంస్థల ఆధ్వర్యంలో బోర్‌వెల్స్ ప్రారంభం



ప్రజాపక్షం/వెంకటాపురం(నూగూరు):వెంకటాపురం మండలంలోని పెంకవాగు, బోధాపురం, తొగుబోరు, మరకాల గ్రామాల్లో దూర ప్రాంత గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు బాలవికాస వరంగల్ సంస్థ సహకారంతో నాలుగు గ్రామాల్లో బోర్‌వెల్స్ ఏర్పాటు చేసి శుక్రవారం ఆయా గ్రామాల సర్పంచ్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్‌లు శిరీష, కోర్సం నరసింహారావులు మాట్లాడుతూ ప్రజల తాగునీటి కష్టాలను తీర్చేందుకు ముందుకొచ్చిన కాఫెడ్ బాలవికాస సంస్థలను అభినందించారు.అనంతరం సంస్థ డైరెక్టర్ లూర్దు రాజు మాట్లాడుతూ ఈ నాలుగు గ్రామాల ప్రజలు తాగు నీటి కోసం ఇంతకుముందు చాలా దూరం వెళ్ళాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు బోర్‌వెల్స్ ఏర్పాటుతో గ్రామ ప్రజలకు తాగునీరు సులభంగా అందుబాటులోకి రావడం వలన వారి రోజువారీ జీవితం ఎంతో సులభమవుతుందని గ్రామస్తులు తెలిపారు.గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం, విద్య, మౌళిక సదుపాయాలు, సామాజిక సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తూ పనిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బోధాపురం గ్రామ ఉప సర్పంచ్ శరత్‌కుమార్, కార్యదర్శి దేవి ప్రియ, బాలవికాస సంస్థ ప్రతినిధి ప్రశాంత్, కాఫెడ్ సంస్థ కోఆర్డినేటర్ హనుమంతు, ఉష, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌టిసి సమ్మెలో విషాదం ... బాధాకరం

ప్రజాపక్షం/మంగపేట :ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ఆదేశాల మేరకు మంగపేట గ్రామ కమిటీ అధ్యక్షులు నూనె లింగయ్య ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో అత్యవసర మావేశం ఏర్పాటు చేయగా ముఖ్య అతిథిగా బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు తాటి కృష్ణ హాజరై మాట్లాడుతు గురువారం రోజున ఆర్‌టిసికార్మికుల సమ్మెలో భాగంగా నర్సంపేట ముత్తోజుపేట గ్రామానికి చెందిన శంకర్ గౌడ్ అనే వ్యక్తి పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడి 80 శాతం గాయాలతో కాలి ప్రాణాలు వదలడం చాలా బాధాకరం తమ డిమాండ్ల సాధన కోసం ఆర్‌టిసి కార్మికుల ఆత్మహత్యలకు పాల్పడి రోద్దన పడకండి నిజాయితీగా ఎంతవరకు అయినా పోరాడి సాధించుకోవాలి తప్ప బలిదానాలు చేసుకోవద్దు అని ప్రభుత్వం చేతకానప్పుడు మేనిఫెస్టోలో ఎందుకు చేర్చాలి ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఆర్‌టిసి సంస్థ గురించి ఐదు అంశాలు చేర్చారు. ఆర్‌టిసి కార్మికులను ప్రభుత్వంలో విలీన ప్రక్రియ పూర్తి చేసి రెండు పిఆర్సీ బకాయిలు వెంటనే చెల్లిస్తాం. వచ్చే పిఆర్సీ పరిధిలోకి టీఎస్ ఆర్‌టిసికార్మికులను చేరుస్తాం. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని వసతులు సదుపాయాలు కల్పిస్తాం. ఆర్‌టిసి బస్సులను ఆధునీకరించి విస్తరిస్తాం అదు నాతనమైన సౌకర్యాలతో కొత్త సర్వీసులు ప్రారంభిస్తాం. ఆర్టీసీ యూనియన్ పునరుద్ధనకు అనుమతిస్తాం. అని ప్రకటించారు ఈ విషయంలో ప్రభుత్వం పూర్తి విఫలమైంది ఇకనైనా ప్రభుత్వం ఒంటెద్దు పోకట మాని ఆర్టీసీ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం చర్చలకు పిలిచి వారి సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలనీ, శంకర్ గౌడ్ కుటుంబానికి బిఆర్ఎస్ పార్టీ తరుపున ప్రగాఢ సానుభూతి తెలుపుతూ వారి కుటుంబానికి కోటి రూపాయలు ఎక్స్ గ్రేషియా చెల్లించి వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని బిఆర్ఎస్ ములుగు జిల్లా నాయకులు తాటి కృష్ణ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చిట్టిమల్ల సమ్మయ్య దంతన పెళ్లి నరేందర్, ఎండి.అన్వర్, ఎండి.ఖుట్బో, గాదె శ్రీనివాస్, ఎండి.అయూబ్, ఎండి.రహీం, పూసల నరసింహారావు, మూగల రమేష్, మూగల రాము, జవంగుల రవీందర్, బిల్వాటి భాస్కర్ పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు మంచినీరు ఓఆర్ఎస్ అందజేత

**ప్రజాపక్షం/అల్లాదుర్గం:**మండలం పరిధిలో గల సీతానగర్ గ్రామంలో శుక్రవారం ఉపాధి హామీ పని చేసే ప్రదేశానికి వెళ్లి 70 మంది కూలీలకు మంచినీరు ఓఆర్ఎస్ ఇంచార్జ్ ఎంపీడీవో చంద్రశేఖర్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ, వడదెబ్బ తగలకుండా కూలీలకు తగు జాగ్రత్తలు చెప్పారు.మంచి నీరు ఎక్కువ త్రాగాలని ఓఆర్ఎస్ దగ్గర అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శోభ సంతోష్, టిఏ సాయి కుమార్, మెట్ సాయిలు పంచాయతీ కార్యదర్శి అనిత స్థానిక నాయకులు పవన్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/శివ్వంపేట :** శివ్వంపేట మండలం చండి గ్రామానికి చెందిన రాజం కొమురమ్మకి, ఆమె తల్లికి ప్రమాదవశాత్తు ఫైర్ యాక్సిడెంట్ అయినందున తాజా మాజీ జడ్పీటీసీ పబ్బమహేష్‌గుప్తా స్పందించి స్థానిక సర్పంచ్ గైనిబైటి ప్రవీణ్‌గౌడ్ చేతులమీదుగా రూ. 5వేల ఆర్థిక సహాయం అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సౌజన్యనరేష్, వార్డు సభ్యులు వెన్నెల నాగరాజు, నాయకులు అంతిరెడ్డిగారి అంజిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రమేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

## పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గ్రామసభ

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నస్కల్ నగరం గ్రామాల్లో శుక్రవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్పంచ్‌లు నాతి అంజమ్మ, లక్ష్మాగౌడ్, అంతంపల్లి సుశీల, సురేష్ బాబు అధ్యక్షతన ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీడీఓ, ఎంపీఓ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రాజిరెడ్డి మాట్లాడుతూ 2 02627 సంవత్సరానికి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక(జీపీడీపీ) రూపొందించినట్లు తెలిపారు. ఉపాధి హామీ పనులు వేసవిని దృష్టిలో ఉంచుకుని ఉదయం 6 నుంచి 10 గంటల వరకు నిర్వహించాలని సూచించారు. గ్రామ ఉప సర్పంచ్లు పోగాల దేవరాజ్, గుగ్లోత్ నాజం, ఎంపీఓ రజినీకాంత్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మొహమ్మద్ ఆరిఫ్ హుస్సేన్, మమత, వార్డు మెంబర్స్ శ్రీకాంత్, రహీం, సుభాష్, దుబాసి సంజీవ్, సీనియర్ మెట్ గోపి, గ్రామ ప్ర జలు పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని విద్యార్థిని ఆత్మహత్య

**ప్రజాపక్షం/పాపన్నపేట:**పరీక్షల్లో ఫెయిల్ అవుతానని భయంతో ఉరి వేసుకుని ఓ పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని పొడ్చన్ పల్లి తండాలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం వివరాలు తండాకు చెందిన బానోత్ సాయిప్రియ (17) కొత్తపల్లి ఉన్నత పాఠశాల లో పదో తరగతి పరీక్షలు రాసింది. పరీక్షలు రాసిన నుంచి ఇంట్లో దిగులుగా ఉంటుంది. దిగులుగా ఉంటున్నావని తల్లి లత అడగగా పరీక్షలు సరిగా రాయలేదని ఫెయిల్ అవుతానని భయం వేస్తుంది అని చెప్పింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎ స్సై పేర్కొన్నారు.

# ప్రభుత్వం వెంటనే పంటలను కొనుగోలు చేయాలి



**ప్రజాపక్షం/గజ్వేల్:**రైతులు పండించిన మొక్కజొన్న, పొద్దు తిరుగుడు పంటలను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం గజ్వేల్ మార్కెట్ యార్డును పార్టీ శ్రేణులతో కలిసి ఆయన సందర్శించారు. తాము పండించిన పంటలను తెచ్చి నెలరోజులు అవుతున్నప్పటికీ అధికారుల నుండి స్పందన లేదని ఈ సందర్భంగా రైతులు ఆయన దృష్టికి తెచ్చారు. అనంతరం ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ అధికారులు మొద్దు నిద్ర మాని వెంటనే కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల అభ్యున్నతి పట్ల చిత్తశుద్ధి లేదని విమర్శించారు. పంటల సాగు, దిగుబడి, కొనుగోలుపై సరైన అవగాహన లేని కారణంగానే రైతులు మార్కెట్ యార్డుల్లో పడి కాపులు కాయాల్సిన దుస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పంటల కొనుగోలుకు వెంటనే ఆదేశించాలని సూచించారు. మధ్య దళారులతో యంత్రాంగం కుమ్మక్కైందని మండిపడ్డారు. జిల్లాలో మల్లన్న సాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్ల నిర్మాణంతోనే అధిక పంటల దిగుబడులు సాధిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్మన్ పద్మాబాయి నర్సింగ రావు, మాజీ వైస్ చైర్మన్ జకీయొద్దీన్, పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, శ్రీనివాస్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, పొట్టోళ్ళ శ్రీనివాస్, అబ్దుల్, ఉమర్, స్వామి చారి, శ్రీనివాస్ రెడ్డి, కరీం, పుల్ల బీరయ్య, బాలచంద్రం, రవీందర్ రెడ్డి, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు




**ప్రజాపక్షం/మెదక్ :** తమ డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెకు మెదక్ జిల్లా పిఆర్టియూ సంఘం బాధ్యులు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మేడి సతీష్ రావు ఆర్టీసీ కార్మికుల దీక్షా శిబిరం వద్దకు వెళ్లి నిన్న ఆత్మబలిదానం చేసుకున్న ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న ఆర్టీసీ కార్మికులు సమస్యలు అన్నింటిని ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ కార్మికులు ఎవరు కూడా బలిదానాలు చేసుకోవద్దు అని విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ కార్మికుల పోరాటానికి పిఆర్టి యూ పూర్తి మద్దతు ప్రకటించారు. ప్రభుత్వం వెంటనే ఆర్టీసీ కార్మికులను చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సామ్యానాయక్, గౌరవ అధ్యక్షులు సబ్బని శ్రీనివాస్, ఇతర బాధ్యులు పాల్గొన్నారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్ రాజీనామా చేయాలి




**ప్రజాపక్షం/గజ్వేల్:**ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ మృతికి బాధ్యత వహిస్తూ రవాణ మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే రాజీనామా చేయాలని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం జీపీసీ డిపో కార్మికులతో కలిసి గజ్వేల్ పట్టణంలో ర్యాలీ నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి మొండి వైఖరి కారణంగా శంకర్ గౌడ్ మృతి చెందగా, ఇందుకు కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత వహించాలని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల హక్కులు కాలరాస్తుండగా, ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని స్పష్టం చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, చాలా కాలంగా పెండింగ్లో ఉన్న కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని, నర్సంపేట బస్ డిపో ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతిని ప్రభుత్వ హత్యగా భావిస్తున్నట్లు చెప్పారు. మృతుడు శంకర్ గౌడ్ కుటుంబానికి రూ కోటి ఇవ్వాలని, చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని అన్నారు. ఆర్టీసీ కార్మికుల జీవితాలతో సీఎం రేవంత్ రెడ్డి చెలగాటమాడకుండా సమస్యలను వెంటనే పరిష్కరించి న్యాయం చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్మన్ పద్మాబాయి నర్సింగరావు, మాజీ వైస్ చైర్మన్ జాకీయొద్దీన్, కోట బాబు, కనక సేన, ఆకుల దేవేందర్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్,అబ్దుల్, ఉమర్, స్వామి చారి, శ్రీనివాస్ రెడ్డి, కరీం, బాలచంద్రం, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యువత నైపుణ్యాలతోనే ఉద్యోగ అవకాశాలు




**ప్రజాపక్షం/మెదక్ :** మారుతున్న కాలానికి అనుగుణంగా యువత తమకు నచ్చిన రంగాల్లో నైపుణ్యాలను మెరుగుపరచుకుంటే ఉద్యోగ అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం సమీకృత కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాల్‌లో ఎస్సి, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన యువతకు స్కిల్ డెవలప్‌మెంట్, స్వయం ఉపాధి పథకాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువతకు సాంకేతిక, వ్యవస్థాపక నైపుణ్యాల్లో ఉచిత శిక్షణ అందించి ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వ కట్టుబడి ఉందన్నారు. పోటీ ప్రపంచంలో నిలవాలంటే కంప్యూటర్ కోర్సుల్లో ప్రావీణ్యం సాధించాలని సూచించారు. అంతకుముందు ఐటీసీ సంస్థ ప్రతినిధులు శిక్షణ ద్వారా ఉద్యోగావకాశాలపై వివరించి, సంస్థలో 50 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. అభ్యర్థుల నుండి అర్హత పత్రాలు స్వీకరించారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, యువత పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యం అమ్మాలి

**ప్రజాపక్షం/నర్సాపూర్:**ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే రైతులు పండించిన వరి ధాన్యాన్ని అమ్మాలని రెడ్డిపల్లి సర్పంచ్ పద్మావతి అశోక్ గౌడ్ అన్నారు. శుక్రవారం నర్సాపూర్ మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో ప్రభుత్వం తరపున ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని రెడ్డిపల్లి సర్పంచ్ పద్మావతి అశోక్ గౌడ్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పద్మావతి మాట్లాడుతూ, రైతులు మధ్య దళారులకు ధాన్యాన్ని అమ్మి మోసపోవద్దని తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని అమ్మితే మద్దతు ధర చెల్లించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్ తదితరులు ఉన్నారు.

## జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం

**ప్రజాపక్షం/పెద్ద శంకరంపేట :** మండలంలోని ఆయా గ్రామాలతో పాటు రామోజీ పల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం జాతీయ ప్రంచాయతీరాజ్ దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక స్వపరిపాలనకు రాజ్యాంగా హోదాను కల్పిస్తూ, భారతదేశంలోని ప్రతి సంవత్సరం ఏప్రిల్ 24 న జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని జరుపుకుంటారు. మొదటి జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని భారత ప్రభుత్వం 2010 లో ప్రకటించింది. 73వ సవరణ, పరిపాలనను గ్రామ స్థాయికి మూడు అంచెలా నిర్మాణాన్ని (గ్రామ పంచాయతీ, పంచాయతీ సమితి మరియు జిల్లా పరిషత్) ప్రవేశపెట్టింది. ఏప్రిల్ 24న గ్రామీణ ప్రాంతాలలో స్వయం పరిపాలన, డిజిటల్ పరిపాలన, గ్రామీణ నీటి సరఫరా, విద్య, వ్యవసాయం వంటి కీలక రంగాల సులభతరం చేస్తుంది. జాతీయ స్మారకోత్సవం 24 ఏప్రిల్ 2026న గ్రామపంచాయతీ కార్యాలయంలో కార్యదర్శులు, సర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు జరుపుకున్నారు.

## ఎల్లమ్మ కళ్యాణానికి మాజీ ఎమ్మెల్యేకు ఆహ్వానం

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** మెదక్ జిల్లా నిజాంపేట్ మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి కళ్యాణ మహోత్సవానికి మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి దంపతులకు గౌడ సంఘం సభ్యులు ఆహ్వానం పత్రికను అందజేశారు. మే 3 నుండి 5 తేదీ వరకు శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం వద్ద జరగనున్న ఈ మహోత్సవాలకు రావాల్సిందిగా గౌడ సంఘం సభ్యులు శుక్రవారం రోజున హైదరాబాద్‌లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా శ్రీ రేణుకా ఎల్లమ్మ, జమదగ్ని మహర్షి కళ్యాణ మహోత్సవానికి రావాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు బజారు సిద్ధ గౌడ్, బజారు స్వామి గౌడ్, జీడి రామాగౌడ్, బజారు రంజిత్ గౌడ్, వెల్దుర్తి శ్రీకాంత్ గౌడ్, రాములు గౌడ్, జీడి చంద్రకాంత్ గౌడ్, పరిపాటి బాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## రామాయంపేట మున్సిపాలిటీకి కోఆప్షన్ అభ్యర్థుల నామినేషన్లు

**ప్రజాపక్షం/రామాయంపేట :** రామాయంపేట మున్సిపాలిటి కోఆప్షన్ సభ్యుల ఎన్నికల ప్రక్రియలో భాగంగా శుక్రవారం నామినేషన్ల పర్వం ఉత్సాహంగా సాగింది. మున్సిపాలిటీలో ఖాళీగా ఉన్న నాలుగు కోఆప్షన్ సభ్యుల స్థానాల భర్తీకి అధికారులు నోటిఫికేషన్ విడుదల చేయగా అభ్యర్థులు తమ అనుచరులతో తరలివచ్చి నామినేషన్లు సమర్పించారు. దేమే యాదగిరి, చింతల రాధాభవాని, మహ్మద్‌గౌస్, ఆసియా సుల్తానా, బొర్ర అనిల్‌కుమార్, చంద్ర ప్రతాప్‌లు మున్సిపల్ మేనేజర్ రఘువరన్‌కు తమ నామినేషన్ పత్రాలను అందజేశారు. మొత్తం నాలుగు స్థానాలకు గాను ఆరు నామినేషన్లు దాఖలైనట్లు మేనేజర్ రఘువరన్ అధికారికంగా ధృవీకరించారు. వచ్చిన దరఖాస్తులను క్షున్నంగా పరిశీలించిన అనంతరం అర్హులైన అభ్యర్థుల వివరాలను వెల్లడిస్తామని ఆయన పేర్కొన్నారు. నాలుగు స్థానాలకు ఆరుగురు పోటీలో ఉండడంతో ఈ ఎన్నిక ఆసక్తికరంగా మారింది. నామినేషన్ల దాఖలుతో మున్సిపల్ కార్యాలయ పరిసరాల్లో రాజకీయ సందడి నెలకొంది. ఎన్నికల నిబంధనలకు లోబడి ఈ ప్రక్రియ పూర్తి చేస్తామని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పోచమ్మల నవనీతగణేష్, కౌన్సిలర్లు బైరం స్వప్న, నాయకులు సరాఫ్ యాదగిరి, రమేష్‌రెడ్డి, దాకి స్వామి, చింతల స్వామితో పాటు తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన మున్సిపల్ చైర్‌పర్సన్

**ప్రజాపక్షం / హుస్నాబాద్ :**ఏప్రిల్ 24 . హుస్నాబాద్ పట్టణంలో వివిధ కారణలతో ఇటివల చనిపోయిన పలువురి కుటుంబాలను హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి కొమురయ్య, వైస్ చైర్‌మెన్ పద్మ రవిందర్, జిల్లా గ్రంధాల య మాజీ చైర్మెన్ కెడం లింగమూర్తి, మార్కెట్ కమీటి చైర్మెన్ తిరుపతి రెడ్డి, 11వార్డు కౌన్సిలర్ పూదరి వరప్రసాద్‌లు కలిసి గురువారం చనిపోయిన తారభాయి మృతదేహానికి పూలమాల వేసి ఘనివాళ్లు అర్పించారు. ఆనంతరం మికొండ ఓదయ్య, సాంబామూర్తి, కుటుంబాలను పరమార్శించి వారికి మనోధైర్యం కలించారు. ఆ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పరంగా మృతుల కుటుంబాలను ఆండగా ఉంటామని భరోస కల్పించారు. ఆలాగే ఎండలు ఆధికంగా ఉన్నందున రైతులు, కూళీలు ఎండలో తిరగవద్దని ప్రజలకు కొరారు. మార్కెట్లో రైతులు తెచ్చిన ధాన్యంను ఆర బెట్టె విషయంలో ఉదయం 11గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు బైట తిగవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రేస్ పార్టీ నాయకులు పాల్గోన్నారు.

## పైవేటు డ్రైవర్ల కాళ్లు మొక్కి నిరసన తెలిపిన కార్మికులు

**ప్రజాపక్షం/నర్సాపూర్:**సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ కార్మికులు చేపడుతున్న సమ్మె రోజురోజుకు ఉధృతం అవుతుంది. అయితే సమ్మెలో భాగంగా శుక్రవారం నర్సాపూర్ బస్టాండ్ లో ఆర్టీసీ కార్మికులు బస్సులు నడుపుతున్న ప్రైవేట్ డ్రైవర్ల కాళ్ళు మొక్కుతూ తమకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికులు ఉన్నారు.

## ట్రాఫిక్ పోలీసులకు వాటర్ బాటిల్స్ పంపిణీ

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:**వరంగల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఎండాకాలం తీవ్రతను దృష్టిలో ఉంచుకొని సిబ్బంది ఆరోగ్యం, సురక్షిత సేవల కోసం ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా వరంగల్ ట్రాఫిక్ ఇన్స్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కె సుజాత ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఏసిపి టి సత్యనారాయణ చేతుల మీదుగా ట్రాఫిక్ సిబ్బందికి వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. ఎండాకాలంలో విధులు నిర్వహించే సిబ్బంది తగినంత నీరు తాగుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ పిల్లలకు కుర్చీలు అందజేత

**ప్రజాపక్షం/రాయపరి:**మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీలోని అంగన్‌వాడీ పిల్లలు, అంగన్‌వాడి కేంద్రానికి 25 కుర్చీలు, ఒక ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి రంగు కుమార్ గౌడ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, మాజీ సర్పంచ్ గారే నర్సయ్య, మాజీ ఎంపిటిసి ఐత రామ్‌చందర్, గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి చందు రామ్, సంది దేవేందర్ రెడ్డి, పెండ్లి సుధాకర్ రెడ్డి, చిన్నల ఉప్పలయ్య, ఐత కుమార్, కుంట రాంబాబు, జీవన్, ఐత రవి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల వద్దనే ధాన్యం అమ్మాలి



**ప్రజాపక్షం/కౌడిపల్లి :**రైతుల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రెండవ విడత రైతు భరోసా రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందని చివరి గింజ వరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని స్థానిక సర్పంచ్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు జిల్లా సర్పంచుల పోరం ఉపాధ్యక్షుడు చంద్రం కృష్ణ గౌడ్ అన్నారు. శుక్రవారం మెదక్ జిల్లా కౌడిపల్లి మండల కేంద్రంలో శ్రీ రేణుక ఎల్లమ్మ మాత ఆలయం వద్ద పిఎసిఎస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ చంద్రం కృష్ణ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రం కృష్ణ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేస్తుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులకు లారీలు రాక అమాలి కొరతతో ఇబ్బందులు గురయ్యేది. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో రైతులకు చిన్నపాటి కష్టం కూడా లేకుండా చూస్తుందన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధరను పొందాలన్నారు. సన్నరకం ధాన్యానికి 500 బోనస్ రైతుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల ఆర్థిక అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్వేత మల్లికార్జున్ గౌడ్, వార్డు సభ్యులు, సింగూరి దేవేందర్, మహమ్మద్ మక్బుల్, గౌడ్ చర్ల ప్రశాంత్, లక్ష్మీ శరత్, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు రాగుల భూమయ్య పటేల్, సిబ్బంది సుధాకర్, విష్ణు, కిషన్, కౌడిపల్లి మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు మాటూరి శాఖయ్య రిటైర్డ్ టీచర్ పుండరీకం గౌడ్, వెంకటేశం గౌడ్, కౌడిపల్లి గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడు చంద్రం కిషోర్ గౌడ్, నాడ్ల వెంకటేష్ గుప్తా, రైతులు పాల్గొన్నారు.

## అకాల వర్షంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** అకాల వర్షంతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిద్దిపేట అర్బన్ మండల మాజీ వైస్ ఎంపిపి అల్లం ఎల్లం, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు యాదగిరిలు అన్నారు. సిద్దిపేట అర్బన్ మండలంలోని ఎన్సాన్ పల్లి,పొన్నాల,కిష్టసాగర్ గ్రామాలలో గురువారం వడగండ్ల వానతో నష్టపోయిన రైతుల పంట పొలాలను,కల్లాలను శుకువారం బిఆర్ఎస్ నాయకులతో కలిసి వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిన్న కురిసిన వర్షాలతో రైతులకు తీవ్ర నష్టం జరిగిందని,ఆందోళన చెందుతున్న రైతులను కలిసి ధైర్యంగా ఉండాలని,మీకు అండగా ఉంటామని,ఈ విషయాన్ని మాజీ మంత్రి ఎంఎల్ఎ హరీష్ రావు దృష్టికి తీసుకెళ్లి అధికారులతో మాట్లాడి అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా కల్పించారు. వ్యవసాయ అధికారులతో మాట్లాడి ప్రభుత్వానికి నివేదిక పంపాలని కోరామన్నారు. అదే విధంగా అర్బన్ మండలంలోని గ్రామాలలో తడిసిన వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు వెంకటయ్య,బాలక్రిష్ణా రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు నాగుల ప్రశాంత్,సంపత్ యాదవ్,నరేందర్,నర్సయ్య తదితరులు పాల్గోన్నారు.

## సంగారెడ్డి బస్ డిపో వద్ద భద్రత ఏర్పాట్ల పరిశీలన



**ప్రజాఫక్షం/సంగారెడ్డి:**ప్రస్తుతం కొనసాగుతున్న ఆర్టీసి సమ్మె నేఫథ్యంలో సంగారెడ్డి బస్‌డిపోను జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్ సందర్శించి అక్కడి బందోబస్తు భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డిపోలో ఉన్న ఆర్టీసీ అదికారులతో మాట్లాడి పరిస్థితులను తెలుసుకున్నారు. బస్సులు ,ప్రభుత్వ ఆస్తులను ఎటువంటి నష్ట ం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమ్మె శాంతియుతంగా కొనసాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాపిక్ ,రవాణా వ్యవస్థను సక్రమంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే డిపో పరిసరాల్లో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ,చట్టానికి లోబడి నడుచుకోవాలని అన్నారు. ప్రజలు కార్మికులు పరస్పర సహకారంతో శాంతి భద్రతలను కాపాడటంలో పోలీసు వారికి సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ బస్సులు నడపడానికి అర్హత కలిగిన డ్రైవర్లు ముందుకు రావాలని సూచించారు.. ఆసక్తి ఉన్న డైవర్లు జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్ నంబర్ 8712656739కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రైవేట్ డ్రైవర్లు తాత్కాలికంగా విధుల్లోకి వచ్చిన ఆర్టీసీ డ్రైవర్లు తిరిగి విదుల్లో చేరినా వారికి ఏటువంటి బెదిరింపులు లేకుండ పూర్తి భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ విజిటింగ్‌లో ఆర్.టీ.సి డిపో మేనేజర్ ఉపేందర్, డిఎస్పీ సత్తయ్య గౌడ్, సంగారెడ్డి పట్టణ ఇన్స్పెక్టర్ రాము నాయుడు, ట్రాపిక్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ రెడ్డి, కొండాపూర్ సిఐ కుమన్ కుమార్ పాల్గోన్నారు.

## బోనాల వేడుకలో కత్తిపోటు కలకలం



**ప్రజాపక్షం/మద్దూరు/ధూళ్మిట్ట :** సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం నర్సయిపల్లి గ్రామంలో బోనాల పండుగ వేడుకలో కత్తిపోటు ఘటన సంచలనం సృష్టించింది. గ్రామానికి చెందిన అన్నెపు శివకృష్ణ తన బామ్మర్ధి చింతల శ్రీకాంత్‌పై కత్తితో దాడి చేయగా అతనికి తీవ్రగాయాలయ్యాయి. అడ్డుకునే ప్రయత్నంలో భార్య శిరీష చేతికి గాయం అయింది. దింతో గ్రామస్తులు అడ్డుకోవడంతో నిందితుడు అన్నెపు శివకృష్ణ పరారయ్యాడు. శిరీష ఫిర్యాదు మేరకు మద్దూరు పోలీసులు కేసు నమోదుచేసి, నిందితుడిని అరెస్ట్ చేశారు. చేర్యాల కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం జూడిషియల్ రిమాండ్ విధించడంతో నిందితుడు అన్నెపు శివకృష్ణని చర్లపల్లి జైలుకు తరలించడం జరిగిందని మద్దూరు ఎస్ఐ ఎండి ఆసిఫ్ తెలిపారు.

## ఓటమి భయంతోనే కాంగ్రెస్ గైర్హాజరు

**ప్రజాఫక్షం/సంగారెడ్డి :**జహిరాబాద్ మున్సిపాలిటీలో కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక ప్రక్రియ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్ పర్సన్ తో పాటు కాంగ్రెస్ కౌన్సిలర్లు మూకుమ్మడిగా ఎన్నికకు గైర్హాజర్ కావడంతో ఎన్నిక ప్రకియ రసాబసగా మారింది. ఎన్నిక సమయానికి ఎమ్మెల్యే మాణిక్‌రావు తన అనుచర వర్గంతో కలిసి మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. అయితే కాంగ్రెస్ సభ్యులెవరూ రాకపోవడంతో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటమి భయం పట్టుకోవడంతోనే కాంగ్రెస్ కౌన్సిలర్లు వెనకడుగు వేశారని ఆయన మండిపడ్డారు. అదికారులను అడ్డుపెట్టుకుని ఎన్నికను అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని అన్నారు. అదికారుల తీరుపై మండిపడుతూ ఎమ్మెల్యే ఆద్వర్యంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి దర్నా చేపట్టారు.

## గుండె పోటుతో మాజీ సర్పంచ్ మృతి

**ప్రజాఫక్షం/జగదేవ్‌పూర్:**జగదేవ్‌పూర్ మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ మ్రరి కింది సుమన్ గౌడ్(40) గురువారం ఆర్థ రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. సుమన్ గౌడ్ మృతి చెందిన సమచారం అందుకున్న పలువురు కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకులు వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎంపిటిసిల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షులు దేవి రవీందర్, మాజీ ఎంపిపి అధ్యక్షులు బాలేషంగౌడ్, జగదేవ్‌పూర్ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు శుక్రవారం బౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాలర్పించారు. ఆనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

## ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన...



**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:**వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం కోసం ఎరువుల వినియోగం అత్యంత ముఖ్యమైనదే,అయితే ఎరువులను అధికంగా వినియోగించడం వలన భూమి సారవంతత తగ్గి భూ కాలుష్యం,పర్యావరణ కాలుష్యం పెరుగుతుందని సిద్దిపేట అర్బన్ మండల వ్యవసాయ అధికారి బి శ్రీనాథ్ అన్నారు. శుక్రవారం సిద్దిపేట అర్బన్ మండలం బక్రిచెప్యాల గ్రామంలో రైతులకు ఎరువుల వినియోగంపై వ్యవసాయ అధికారి బి శ్రీనాథ్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు అధికంగా వినియోగించడం వల్ల భూ కాలుష్యం,పర్యావరణ కాలుష్యం పెరిగి పంటల నాణ్యతపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని,రైతులు ఎరువులను వివేకంతో ఉపయోగించాల్సిన అవసరం ఉందన్నారు. రైతులకు ముఖ్యమైన సూచనలు అందించారు.ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ జక్కుల శ్రీలత శ్రీనివాస్,ఎఇఒ రాజేష్,బిటిఎం భవాని ప్రసాద్,రైతులు పాల్గోన్నారు.

## రిజిస్ట్రేషన్ కార్యాలయంలో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

**ప్రజాఫక్షం/సంగారెడి:** కంది మండల పరిధిలోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో విజెలెన్స్ అదికారులు తనీఖీలు చేపట్టారు. సిటిజన్ చార్టర్ నిబంధనలకు అనుగుణంగా కార్యాలయంలో అందిస్తున్న సేవలపై అధికారులు ఆరా తీస్తున్నారు. విజిలెన్స్ శాఖ డిజి శిఖా గోయల్ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టారు. ప్రధానంగా చాలా రోజుల నుంచి పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్ పైల్స్‌కు సంబందించిన వాటిపై అదికారులు దృష్టి సారించారు. రిజిస్ట్రేషన్ కు సంబందించి కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఏలాంటి సౌకర్యాలు అందజేస్తున్నారనే విషయంపై విజిలెన్స్ డిఎస్పీ సతీష్ రెడ్డి, ఆద్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. అయితే అదికారులు సాయంత్రం వరకు ఈ తనిఖీలు నిర్వహించనున్నారు. ప్రతి ఒక్క అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం రాష్ట్ర కార్యాలయానికి రిపోర్టు చేయనున్నారు.

# ఆర్టీసీ కార్మికుల మరణాలు ప్రభుత్వ హత్యలే

### బీజేపీ రాష్ట్ర మీడియా పానలిస్టుగా డాక్టర్ సురేష్ గౌడ్

**ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట :** తెలంగాణలో ఆర్టీసీ కార్మికుల ఆత్మహత్యలు ప్రభుత్వ నిర్లక్ష్య ఫలితమేనని భారతీయ జనతా యువ మోర్చా రాష్ట్ర ప్రధానకార్యదర్శి, బిజెపి రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి డాక్టర్ బొంగొని సురేష్ గౌడ్ ఆరోపించారు. కార్మికుల డిమాండ్లను వెంటనే పరిష్కరించి, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని ప్రభుత్వాన్ని డాక్టర్ బొంగొని సురేష్ గౌడ్ డిమాండ్ చేవారు. కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడవద్దని సురేష్ గౌడ్ సూచించారు.

# మంతెన నారాయణ రెడ్డి 32వ వర్ధంతి వేడుకలు

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** ఉమ్మడి వరంగల్ జిల్లా సీపీఎం ఉద్యమ నిర్మాతలలో ఒకరు, పీడిత, తాడిత ప్రజల పక్షాన నిరంతరం పోరాడిన యోధుడు అమరజీవి మంతెన నారాయణ రెడ్డి అని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సాంబరాజు యాదగిరి అన్నారు. సీపీఎం జిల్లా కార్యాలయంలో శుక్రవారం మంతెన నారాయణ రెడ్డి 32వ వర్ధంతి సభ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ అధ్యక్షతన జరిగింది. వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శేఖర్, జిల్లా కమిటి సభ్యులు గోపి, విజేందర్, అజారుద్దీన్, నాయకులు బీరయ్య, ప్రశాంత్, వెంకటేష్, మల్లేష్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పేరిట పచ్చని చెట్ల ఊచకోత



**ప్రజాపక్షం/ముత్తారం :** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు ఒ కవైపు సంతోషాన్ని కలిగిస్తుంటే,మరోవైపు ప ర్యావరణ ప్రేమికులను ఆవేదనకు గురిచేస్తున్నాయి.పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడ్ నుండి ముత్తారం వరకు ఉన్న ప్రధాన రహదారిని వెడల్పు చేసే క్రమంలో రహదారికి ఇరువైపులా ఉన్న భారీ వృక్షాలను అధికారులు యంత్రాల సాయంతో తొలగిస్తున్నారు.ఓడేడు గ్రామ మాజీ సర్పంచ్ సిరికోండ బక్కారావు గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలోగత 7 సంవత్సరాల క్రితం అధికారులు,స్థానికులు ఎంతో కష్టపడి నాటి, సంరక్షించిన ఈ చెట్లు ఇప్పుడు రోడ్డు వెడల్పులో భాగంగా నేలమట్టం అవుతున్నాయి.వందల సంఖ్యలో ఉన్న ఈ చెట్లను నరికివేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఎండాకాలం సమీపిస్తున్న తరుణంలో, ప్రయాణికులకు నీడను ఇచ్చే ఈ పచ్చని చెట్లు కనుమరుగుకావడం వల్ల ఈ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని పర్యావరణవేత్తలు ఆందోళన చెందుతున్నారు. రోడ్డు విస్తరణ తర్వాత కనీసం ఇప్పుడు కోల్పోయిన చెట్లకు రెట్టింపు సంఖ్యలో మొక్కలు నాటి,వాటిని సంరక్షించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలి..

### ఆత్మహత్యలు వద్దు తెగించి పోరాడుదాం..

### సిపిఐ మండల కార్యదర్శి బోనగిరి రూపేష్



**ప్రజాపక్షం/బెజ్జంకి:**ఆర్టీసి కార్మికుల న్యాయమైన డిమాండ్లను తక్షనమే పరిష్కరించాలని సిపిఐ మండల కార్యదర్శి బోనగిరి రూపేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శుక్రవారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ ఆర్టీసి కార్మికులు చేపట్టిన సమ్మెకు మండల సిపిఐ మండల సమితి పూర్తి మద్దతు తెలియజేస్తున్నట్లు తెలిపారు.కార్మికులు చేపట్టిన సమ్మె మూడవ రోజుకు చేరుకున్న ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం లేదని అన్నారు.ఇప్పటికే ఆర్టీసి కార్మికుడు శంకర్ గౌడ్ ఆత్మహత్య రాష్ట్ర వ్యాప్తంగా చాలా భాధను నింపిందని ఆవేదన వ్యక్తం చేశారు.తక్షనమే ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని శంకర్ గౌడ్ కుటుంబానికి యాభై లక్షల రూపాయల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/ కమలాపూర్:**ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తవుటం ఝాన్సీ రాణి రవీందర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జీ వొడితల ప్రణవ్ బాబు ఆదేశాలతో కమలాపూర్ మండలం వంగపల్లి, అంబాల గ్రామాలలో పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తవుటం ఝాన్సీ రాణి రవీందర్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ధాన్యాన్ని విక్రయించే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను కోరడం జరిగిందని, ప్రజా ప్రభుత్వానికి రైతులు అండగా నిలబడి సిఎం రేవంత్ రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ దేశిని ఐలయ్య, డైరెక్టర్లు ఉరుసు తిరుపతి, కిన్నెర కృష్ణమూర్తి, సర్పంచ్ నకీర్త రాజు, కాంగ్రెస్ నాయకులు పొడేటి బిక్షపతి, హనుమాన్ ప్రసాద్, బోళ్ళ సాగర్, అంకతి వెంకటేశ్వర్లు, మాటూరి ఎల్లమ్మ, చందబోయిన సాయి, ఫ్యాక్స్ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస రావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిజాయితీగా పనిచేస్తే విజయం సాధించవచ్చు



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** నిజాయితీగా పనిచేస్తేనే విజయం దానంత అదే వరిస్తుందని.. సిద్దిపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేశ్ బాబు, లీగల్ సెల్ అథారిటీ డిప్యూటీ చీఫ్ శరత్‌బాబు అన్నారు. మూట్ కోర్టు ప్రాజెక్టులో భాగంగా వినాయక లా కళాశాల విద్యార్థులు శుక్రవారం సిద్దిపేటలోని కోర్టులను సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రమేశ్ బాబు మాట్లాడుతూ న్యాయవాదులు నిజాయితీగా పని చేయాలన్నారు. న్యాయవాదులు ఎక్కువగావ భాషలు నేర్చుకోవటం వల్ల సబ్జెక్ట్‌పై పట్టు సాధించి కేసులను సులభంగా గెలువ వచ్చునన్నారు. డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చైల్డ్ మ్యారేజీ ప్రొటెక్షన్ అవగాహన సదస్సులో లా విద్యార్థులు పాల్గొన్నారు. డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చైల్డ్ మ్యారేజీ,ప్రొటెక్షన్ అవగాహన సదస్సులో లా విద్యార్థులు పాల్గొన్నారు.డిఎస్ఎల్ డిప్యూటీ చీఫ్ శరత్ బాబు విద్యార్థులకు చైల్డ్ ప్రొటెక్షన్ చైల్డ్ మ్యారేజీపై ఉన్న చట్టాలను అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి సదానందం, వినాయక లా కళాశాల చైర్మన్ రాజు, వైస్ ప్రిన్సిపల్

# మూడో రోజుకు చేరిన ఆర్టీసీ సమ్మె




**ప్రజాపక్షం/సిద్దిపేట:** ఆర్టీసీ రక్షణ సమస్యల సాధన కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామిల అమలుకై ఆర్టీసీ కార్మికులు జిల్లా వ్యాప్తంగా చేపట్టిన సమ్మె శుక్రవారంతో మూడో రోజుకు చేరుకుతుంది. దీంతో బస్సులడిపోలకే పరిమితం అయ్యాయి. తమ న్యాయమైన డిమాండ్లును పరిష్కరించాలని ఆయా డిపోల ఎదుట కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. జిల్లాలోని సిద్దిపేట, హుస్నాబాద్, గజ్వేల్, దుబ్బాజ డిపోల వద్ద ఆర్టీసీ పోరాటంలో ఆశువులు బాసిన డ్రైవర్ శంకర్‌గౌడ్‌కు ఘన నివాళులర్పించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ నోటికి నల్లగుడ్డ ధరించి నిరసన ర్యాలీ నిర్వహించారు. హైదారాబాద్ రోడ్డులోని డిపో నుండి ప్రారంభమైన కార్మికుల నిరసన ర్యాలీ పాత బస్టాండ్ అంబేద్కర్ సర్కిల్ వరకు సాగింది. అంబేద్కర్ విగ్రహానికి కార్మికులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆర్టీసీ పోరాటంలో చదనిపోయిన నర్సంపేట డిపో డ్రైవర్ శంకర్ గౌడ్‌కు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్టీసీ జెఎసి నాకులు నక్క మల్లేశం, టిఎస్ గౌడ్, రవీందర్ గౌడ్, కెఎం రెడ్డి, శ్రీనివాస్, బాలయ్య, అల్తాఫ్‌తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని బస్సు డిపోల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# డ్రగ్స్ నియంత్రణపై కళా ప్రదర్శన



**ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట :** సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బిజ్జూరిరవి కుమార్ (ఎడి/డిపిఆర్‌ఓ) సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి ఆదేవాల మేరకు ధూల్మిట్ట మండలంలోని దుబ్బతండాలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రత, నియమాలు మరియు డ్రగ్స్ గంజాయి నియంత్రణ, అలాగే రోడ్డు భద్రత నియమాలు, ప్రభుత్వ పథకాలు, వేసవికాలంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తెలంగాణ సాస్కృతిక సారధి సిద్దిపేట ఆద్వర్యంలో కళా ప్రదర్శన నిర్వహించినట్లు తెలంగాణ సాస్కృతిక సారధి సిద్దిపేట టీం లీడర్ పిల్లిట్ల శ్యామ్ సుందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాల్త్య రమేష్, తెలంగాణ సాస్కృతిక సారధి సిద్దిపేట టీం లీడర్ పిల్లిట్ల శ్యామ్ సుందర్‌తో పాటుగా గెంటే హరిప్రసాద్, కనుకయ్య, బిక్షపతి, రత్నం, శ్రీనివాస్, సిద్దిలు, రాచపల్లి శైలజ గ్రామస్తులు తదితరులు పాల్గోన్నారు.

# ధూల్మిట్టలో చలివేంద్రం ప్రారంభం

**ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట :** వేసవికాలంలో ప్రజలకు చల్లని త్రాగెనీరు అందించాలని, ధూల్మిట్ట మండలకేంద్రంలోని న్యూ మరియు ఓల్డ్ బస్ స్టాండ్‌లలో కీర్తి శేషులు గెంటే రామలక్ష్మి యాదగిరి, మరియు శిరబోయిన సాయమ్మ ఐలయ్య గార్ల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ధూల్మిట్ట గ్రామ సర్పంచ్ గునుకుల లీలా జగన్‌మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ దుబ్బుడు దీపిక వేణుగోపాల్ రెడ్డితో పాటుగా గ్రామ ప్రముఖులతో కలసి చలివేంద్రంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామ పంచాయితీ వార్డు సభ్యులతో పాటుగా నిర్వాహకులు గెంటే హరిప్రసాద్, శివ, ప్రశాంత్, శిరబోయిన రాజయ్య తిరుపతి పాల్గోన్నారు.

# బచ్చన్నపేట నూతన ఎస్ఐగా శ్రీకాంత్ బాధ్యతల స్వీకరణ

ప్రజాపక్షం/బచ్చన్నపేట: బచ్చన్నపేట మండల నూతన ఎస్ఐగా ఎ శ్రీకాంత్ శుక్రవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్ఐ హమీద్ వరంగల్ వీఆర్‌కు బదిలీ కాగా, ఆయన స్థానంలో వరంగల్ వీఆర్ నుండి శ్రీకాంత్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. అనంతరం ఎస్ఐ శ్రీకాంత్ విలేకరులతో మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. గ్రామాలలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా అక్రమ కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని ఆయన ప్రజలను కోరారు.

# ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేయాలి-సీఐటీయూ



**ప్రజాపక్షం/జనగామ టౌన్:** ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సుంచు విజేందర్ అన్నారు. ఆర్టీసి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గత మూడు రోజులుగా చేస్తున్న సమ్మెకు సీఐటీయూ జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు తెలియజేసింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఆర్టీసి యూనియన్ జేఏసీ నాయకులతో చర్చలు జరిపి తమ సానుకూలమైన డిమాండ్లను సత్వరమే పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బూడిద ప్రశాంత్, నాయకులు సతీష్, వెంకటేష్, మహేందర్, ఆర్టీసి కార్మికులు పాల్గొన్నారు.